# స్నేహప్రభ

"రంగనాథం మోటార్ ట్రాన్స్‌పోర్టు కంపెనీ" ... అనే అక్షరాలని రెండుసార్లు చదివి 'అమ్మయ్య, ఇది' అనుకుంటూ లోపలికి వస్తూంది ప్రభ. ఊతకర్రలు చేసే టక్ టక్ శబ్దానికి అప్పటికే అక్కడికి ఇంటర్వ్యూకి వచ్చిన యువతీ యువకులు తలలు తిప్పి చూశారు. వరండాలో వేసివున్న కుర్చీలూ, బెంచీలూ నిండిపోయి ఉన్నాయి. ఒక వారగా వచ్చి నిలుచుని గోడకి ఆనుకుని నిలబడి నుదురుకు పట్టిన చెమట పమిట చెంగుతో తుడుచుకుంటూ సర్టిఫికెట్లుని ఓ సారి సరిచూసుకొని దగ్గరలో వున్న ఓ బొంబే డైయింగ్ శారీ అమ్మాయిని "టైమెంత అయిందండీ" అంది, తన మట్టిగాజులున్న చేతివైపు ఓ మారు విసుగ్గా చూసుకుని.

"టెన్ థర్టీ" అంది ఆమె, చచ్చువడి సన్నగా

వేలాడే ప్రభ కాలువైపు చూస్తూ. ఆ చూపు భరించలేక తల వంచుకుంది ప్రభ.

ఆ అమ్మాయే కాదు, తనని మొట్టమొదటిసారిగా చూడటం తటస్థించిన ప్రతి వాళ్ళూ తన ముఖాన్ని కాక, ఆ కుంటికాలినే చూస్తారు. అది భరించటం ఎంత కష్టమో తనకు ఒక్కదానికే తెలుసు. ప్రభకి రెండు సంవత్సరాల వయస్సులో 'పోలియో' వచ్చి కాలు అలా అయిపోయింది. ఆడపిల్ల...అందులో పేద యింట్లో పుట్టిన పిల్ల కిలా భగవంతుడు చేసినందుకు తల్లిదండ్రులు కుమిలిపోయారు. ఎన్నో వైద్యాలు చేయించారు. కాని, ప్రయోజనం లేకపోయింది. సుశీలమ్మకి ప్రభ, విశ్వ - ఇద్దరే పిల్లలు. విశ్వాన్ని ఎన్నో కష్టాలుపడి పి. యు. సి. పాస్ చేయించింది. ఇంక పైకి చదివించలేక ఉద్యోగప్రయత్నం చేస్తూండగానే ప్రభ తండ్రి కూడా హఠాత్తుగా మరణించాడు. అప్పటికి ప్రభ స్కూలు ఫైనల్ పాసైంది. వైపు లోయర్ పాసైంది. అంతే. ఇల్లు గడవడం కష్టమైపోతూన్నా, చెల్లెలిపెళ్ళి ఎలాగైనా చెయ్యాలని విశ్వం ఎన్నో ప్రయత్నాలు చేశాడు.

ప్రభ 'అవిటి' దని ముందుగానే చెప్పినా పిల్లని చూస్తాం అని వచ్చి కాఫీలూ, ఫలహారాలూ సేవించి కట్నం దగ్గర బేరం కుదరక వెళ్ళిపోయినవాళ్ళు ఇప్పటికి పన్నెండు మంది.

పెళ్ళికొడుకుల ఇంటర్వ్యూలో త నెన్నటికీ సెలెక్టు

కాలేదని ప్రభకు తెలుసు. "నాకు పెళ్ళి వద్దమ్మా" అని తల్లిదగ్గర బావురమని ఏడ్చింది ఎన్నో సార్లు.

"ఆడపిల్లవి! ఎన్నాళ్ళని పెళ్ళిలేకుండా ఉంచమంటావు, తల్లీ" అని సుశీలమ్మ కూతురికి నచ్చ చెప్పబోయేది! "నీకు తెలియదమ్మా, నేను భరించలేను. నాకు పెళ్ళివద్దు, ఏంవద్దు. ఏదైనా ఉద్యోగం కోసం ప్రయత్నిస్తాను" అంటూ తల్లి మాట వినకుండా ఎన్నో ఉద్యోగాలకి అప్లికేషను పెట్టింది. విశ్వానికి చెల్లెలిని బయటకి పంపటం ఇష్టం లేకున్నా, చేయగలిగిందేమీ లేక ఊరుకున్నాడు. ఇంటికి కొత్తవాళ్ళు వస్తే చాలు, వీలైనంతవరకూ వాళ్ళకి ఎదురుపడకుండా తప్పుకు తిరుగుతుంది ప్రభ. అందమైన ఏ అమ్మాయిని చూసినా, పరుగెత్తే ఆడపిల్లని చూసినా ప్రభకి ఎంతో ఇష్టం. వీళ్ళెంత అదృష్టవంతులు ... ఎంత హాయిగా, ఆనందంగా పరుగుతీసున్నారు - అనుకుని అంతలోనే తన దురదృష్టానికి కుమిలిపోయేది. చిన్నపిల్లప్పుడు తన అవిటితనానికి పైకి ఏడ్చేసి తేలికపడేది. పెదదైన తరువాత లోలోపల ఏడుస్తూ ఎవ్వరూ చూడకుండా కన్నీళ్ళు పమిట కొంగుతో ఒత్తేసుకుంటుంది బయటికి రావటం యెంత ఇష్టం లేకున్నా, ఈ ఉద్యోగాన్వేషణలో తరుచుగా కొత్త వాళ్ళ ఎదుట పడక తప్పటంలేదు. వాళ్ళ దృష్టిని తప్పించుకుని తనని కాదన్నట్టు యెటో చూస్తూ పని పూర్తి చేసుకుని బయటపడి 'అమ్మయ్య' అనుకుని మెల్లగా ఊతకర్రలు టక్ టక్ శబ్దం చేసుకుంటూ ఇల్లు చేరుతుంది ప్రభ.

ఈ కంపెనీలో ఉద్యోగాలు ఉన్నాయంటూ అప్లికేషన్ పెట్టటం, ఇంటర్వ్యూ కార్డు రావటం ప్రభకి ఎంతో సంతోషంగా ఉంది. 'నాకీ ఉద్యోగం తప్పకుండా వస్తుంది. అవును, వస్తుంది' అని అలా రావాలని, తనకి సాయపడమనీ యిక్కడికి వచ్చేముందు భగవంతుణ్ని మనస్ఫూర్తిగా ప్రార్థించటమే కాక, రెండు కొబ్బరికాయలు కొడతానని 'లంచం' కూడా పెట్టింది. అయితే, యీ ఉద్యోగంకోసం వచ్చిన మిగతా అమ్మాయిలూ, అబ్బాయిలూ తనకంటే యెక్కువ లంచం భగవంతుడికిగానీ, కంపెనీలో మానేజర్‌కిగాని యిస్తామని గట్టిగా ప్రయత్నిస్తున్నారేమో ప్రభకి తెలియదు.

ప్రభ అక్కడ ఉన్న అందరినీ ఒక్కసారి కలయజూసింది. అబ్బాయిలు నీట్‌గా డ్రెస్ చేసుకుని పెళ్ళిచూపులకి వచ్చిన పెళ్ళికొడుకుల్లా ఉన్నారు. ఇంక అమ్మాయిలు సరేసరి, సీతాకోకచిలుకల్లా అలంకరించుకుని రకరకాలుగా కనిపిస్తున్నారు ప్రభ కళ్ళకి. వాళ్ళ అందరిలో సగం వెలిసిన నేతచీర, మాచింగుకాని జాకెట్టు వేసుకుని, కనీసం గిల్టు గొలుసైనా లేని బోసిమెడతో దిష్టి బొమ్మలా నిలుచున్నట్లు అనిపించింది. అక్కడ చేరిన యువతీ యువకులు ప్రభని పరీక్షించటం పూర్తి అయిన తరవాత మెడలు మరో వైపుకి తిప్పేశారు.

ఒకాయనవచ్చి అందరి సర్టిఫికెట్లూ పరీక్షిస్తున్నాడు. ఇంక తతంగం ప్రారంభమవబోతూంది - అనుకుంది ప్రభ. అలా అలా చూస్తూ ఓ యువకుని పైన దృష్టి నిలిపింది.

నల్లగళ్ళ కాటన్ పాంటు పైజామా అంత లూజుగా ఉంది. దాన్ని టక్ చేసి మోచేతులపైకి మడిచి మాటి మాటికీ కాలర్ వెనక్కి లాక్కుంటూ అవస్థపడుతూనే తన చుట్టూ వున్న వాళ్ళని పరీక్షిస్తున్నాడు. చేతిలో ఇంటర్వ్యూకి వచ్చారనేందుకు సాక్ష్యం ఉంది. అతనికి ఇరవై అయిదు సంవత్సరాలుపైనే వుండవచ్చు. చామనచాయలో సన్నగా, మరీ అంత పొడుగు కాకుండా వున్న అతన్ని చూస్తూంది ప్రభ. అతని ముఖంలో ఇంటర్వ్యూ ఏమవుతుందో అనే కలవరపాటు కానీ, అసలు ఎలాంటి ప్రశ్నలు వేస్తారో అనే గాభరాగానీ లేకుండా నిశ్చలంగా నిలుచుని మిగతా అంద రినీ సరదాగా చూస్తూ, మధ్య మధ్య పాంటు జేబులోనుంచి స్టార్లింగ్ పిప్పరమెంటు పాకెట్టు తీసి ఒకటి తెరిచీ తెరవనట్లు నోరు కదిపి బుగ్గకి ఓ పక్కకి తోసి, మళ్ళీ అమ్మాయిల్ని పరీక్షించటంలో మునిగిపోయాడు. వరసగా కదులుతున్న అతని దృష్టి ఒకేచోట నిలిచిపోవటం గ్రహించిన ప్రభ తనూ అటువైపు చూసింది.

ముదురు నీలం జాకెట్టు చీర, అదే కలర్ సిల్కు స్లీవ్‌లెస్ జాకెట్టు, అందంగా చుట్టినసిగ, వీపులో సగభాగం తెల్లగా మెరుస్తూ కనిపిస్తూంది. 'అబ్బ! ఎంత బాగుం దీ అమ్మాయి! ఎంత అందమైన కళ్ళు! చాలా మంచి పర్సనా లిటీ, యింత అందంగా, ఆరోగ్యంగా, అవిటితనం లేకుండా వుండటం నిజంగా ఎంతపుణ్యం చేసుకుంటునో! లేక ఏ దేవత వరమో!' అనుకుంటూ ఆ అమ్మాయినే చూస్తూంది

ప్రభ. 'అబ్బ! హైహీలుస్ వేసుకున్నందువల్ల మరీ అందంగా ఇంకా పొడుగ్గా కనిపిస్తూంది' అనుకుంటూనే 'అంత ఖరీదయిన బట్టలు వేసుకున్న ఆ అమ్మాయి ఇంత చిన్న ఉద్యోగానికి రావలసినంత ఖర్మ ఏం వచ్చిందో! వీళ్ళిచ్చే నెలజీతం కంటేకూడా ఖరీదైన బట్టలుకట్టింది' అనుకుంటూ ఆ నల్లపాంటు అబ్బాయి ఇంకా ఈ అమ్మాయి వైపే చూస్తున్నాడా, లేదా అని తల తిప్పింది.

అతను ఆమెను పరీక్షిస్తూనే ఉన్నాడు. ప్రభకి మొదట కోపం వచ్చింది-వెధవ రౌడీలా వున్నాడు. లేకుంటే ఏమిటా చూడటం అని! అతను క్రమంగా ఆ అమ్మాయి మీదనుంచి వరసగా మిగతా వాళ్ళని చూస్తూ ప్రభ మీదికి మళ్ళించాడు దృష్టిని. క్షణం మాత్రమే ప్రభ కుంటి కాలినీ, ఊతకర్రలనీ చూశాడు అంతే. మళ్ళీ అటు చూడకుండా ప్రభ ముఖంలోకి సూటిగా చూశాడు. ప్రభకి చాలా చికాకుగా ఉంది. ముఖం చిట్లించి తల తిప్పేసుకుంది. అయితే, అతను మాత్రం ప్రభని గమనిస్తూనే ఉన్నాడు.

ఇంటర్వ్యూ ప్రారంభమైంది. రెండు ఖాళీలకి నూట పన్నెండుమంది వచ్చారు. అన్ని చోట్లా జరిగినట్లే జరిగింది. రెండు గంటలు దాటింది అప్పటికే.

'త్వరగానే నిర్ణయం తెలియజేస్తారు. వీలున్న వారు ఉండవచ్చు' అని తెలియటంతో తనకి రాదు అనే భయం

వున్నా, ఎలా చెప్పగలవు—వస్తుందేమో అనే ఆశ ప్రభనే కాదు, చాలా మందిని వెళ్ళనీయలేదు. అందరూ 'టీ' కి వెళ్ళిపోయారు. ప్రభ ఆలోచిస్తూ అక్కడే కూర్చుండి పోయింది. అంతక్రితం చూసిన నల్లపాంటు యువకుడు ప్రభ దగ్గరి కొచ్చి 'నమస్కారం' అనటంతో ఉలిక్కిపడినట్లయి అంతలోనే సర్దుకొని 'నమస్తే' అంది, చీరకుచ్చెళ్లు యింకా కిందికి పరిచి కుంటికాలు కనిపించకుండా సర్దుకుంటూ.

"మీరు 'టీ'కి వెళ్ళలేదు. ఒకవేళ .. వెళ్ళలేక మానేస్తే మాత్రం చెప్పండి-నే తెచ్చి యిస్తాను."

"థాంక్సు! నాకు అలవాటు లేదు, మీ కా శ్రమ అక్కర్లేదు."

"అయితే, బాధే లేదు. చూడండి, కాస్సేపు కబుర్లు చెపుతాను. నాకు ఓ చెడ్డ అలవాటుంది. ఏమిటంటే, మాట్లాడకుండా ఒక్క క్షణంకూడా ఉండలేను. ఎదటి వాళ్లు మౌనానందస్వాములవార్లలా కూర్చున్నా నే భరించ లేను. ఏమి టలా చూస్తున్నారు? నే టీ తాగటానికి వెళ్ళ లేదేం అనా! నా దగ్గర పావలాకి మించి ఒక్క పైస లేదు. నా స్థితి చెప్పుకోవటానికి సిగ్గుపడను. మరి మీరూ మనస్సు విప్పి మాట్లాడితే సంతోషం. ఇందరుండగా మీ దగ్గరకే వచ్చి నే నెందుకు మాటలు కలపాలి – అని సందేహం ఒక వైపు, వీడెవడో రాడీవెధవలా ఉన్నాడనే చికాకూ మీ కళ్ళలో కనిపిస్తూనే ఉంది. వియ్యానికైనా, కయ్యానికైనా సమ ఉజ్జీ కావాలట. అలాగే కాలక్షేపానికికూడా సమాన

హోదా వాళ్ళయితే త్వరగా ఆత్మీయత ఏర్పడవచ్చు. అలా కళ్ళెర్రజేసినా నే మాట్లాడుతూనే ఉంటాను. నన్ను అర్థం చేసుకోండి అని చెప్పానా! మన ఇద్దరి స్థితి ఒక్కలా కనిపిస్తూంది. అయితే, నాకంటే మీరే మెరుగు. ఏమిటంటారా- మీరు కట్టిన ఈ సగం వెలిసిన నేతచీరె, ఒక్కసారయినా ఇస్త్రీ ముఖం ఎరగనంటున్న జాకెట్టు, మాసిపోయి రంగు పోయిన మట్టి గాజులు-వీటిని చూసి అంచనా వేశాను. కోపగించకండి ఇంక నా స్థితి చెప్పేస్తాను. చెప్పమంటారా! మీ బట్టలయినా స్వంతం, నా కా అదృష్టంకూడా లేదు. చూడండి, యీ లూజు పాంటు, పైజామాలా లేదూ! ఇంక అరడుగుల శాలీకి సరిపోయే ఈ షర్టు వేలాడుతుంటే మోచేతుల పైకి ఎగదోసుకోలేక పడేఅవస్థ నా పరిస్థితినిపట్టిస్తూనే వుందిగా! లాండ్రీ వీరన్న బట్టల అద్దెబాపతు బాకీ చాలావుందని కోపంతో ఇంటర్వ్యూకి మంచి బట్టలు కావాలని గోలెట్టినా, నీ విచ్చే డబ్బులకిది చాల్లే - అంటూ ముఖాన విసిరికొట్టాడు. వాడు పెట్టిన టైముకి పావుగంట ఆలస్యమైనా మరో రోజు డబ్బు లెక్కలో రాసేసి వడ్డీతో సహా గుంజేస్తాడు! చూశారా, మీ ముఖంలో కోపపు ఛాయలు కాస్త కాస్తగా ఎగిరిపోతున్నాయి. అన్నట్లు నన్ను నేను పరిచయం చేసుకోవటం మరిచిపోయాను. నా పేరు రామకృష్ణ. అమ్మ మాత్రం వుంది. బి. ఎ. పాసైనాను. నాలుగేళ్ళుగా నిరుద్యోగిని. అక్కా చెల్లెలూ, అన్నా తమ్ముడూ - ఎవ్వరూ లేరు. అందుకేనేమో కని

పించిన ప్రతి అమ్మాయినీ 'చెల్లాయ్' అని పిలవలేను. అంత మంచి మనస్సుకూడా కాదులెండి. కానీ, కొందరిని చూస్తే 'చెల్లెమ్మా' అనే పిలుపు గుండెలోనుంచి చీల్చుకుంటూ వస్తుంది. మరింక మీ వివరాలు చెప్పటానికి అభ్యంతరం ఉండదనుకుంటాను."

ప్రభ అతన్ని మొదట సిర్లక్ష్యంగా చూసింది. కానీ, అతని మాటలకి ఆకర్షించబడిపోతున్న మనస్సుని పట్టి బంధిస్తూ, "ఏం! చుట్టరికం తిరగేస్తారా?" అంది కాస్త కటువుగా.

"సారీ! అపార్థం హతమగుగాక. ఇంతకీ మాట్లాడనంటారు ఏం చేస్తాం? పోనీ, పేరైనా చెప్పండి...ఏం... అదీ ఇష్టంలేదా?"

"లేదు."

ఓ"హో! చూడండి, మీరు చెప్పకున్నా తెలుసుకోవాలంటే అయిదు నిమిషాలు పట్టదు. అయితే, నాకంత అవసరంలేదు. మీ భయం ఏమిటో నాకు తెలుసు. వివరాలు తెలుసుకొని మీ ఇంటిచుట్టూ ప్రదక్షిణాలు ప్రారంభిస్తారనేమో అని. ఇదివరకు ఇలాంటివాళ్ళతో కాస్త ఇబ్బంది కలిగినట్లుంది. కానీ, నాది అసలే ఎంతో బిజీ లైఫ్. ఓ! మరిచిపోయాను. మీ వివరాలు చెప్పలేదుగా, నా వివరాల జోలికి పోవద్దు. సరే, ప్రస్తుతం ఇద్దరం ఇంటర్వ్యూలకి

వచ్చాం గనక, ప్రత్యర్థులం అనుకోకండి. ఆ పోస్టులు ఎవరి కొస్తాయో నాకు తెలుసు. మన ఇద్దరికీ రాదని గట్టిగా చెప్పగలను" అంటూ పాంటు జేబులోనుంచి పిప్పరమెంట్ల పాకెట్ తీసుకొని ఒకటి నోట్లో వేసుకుని, "అభ్యంతరం లేకపోతే...ఒకటి తీసుకోండి" అని అందించాడు.

"అక్కరలేదు" అంది పొడిగా.

"పోనివ్వండి. నాకే మరోసారికి పనికొస్తుంది. ఊఁ. ఆడపిల్లలు చదివి ఉద్యోగాలంటూ బయటికొస్తున్నారే గానీ...ప్రపంచాన్ని ఏ మాత్రం అర్థం చేసుకోలేకుండా ఉన్నారు."

"ఎలా అనుకుంటున్నారు?"

"ఎగ్జాంపుల్ మీరే! ఓ వైపు నోరెండిపోతూంది. టీకి డబ్బులున్నాయో లేదో, లేక అవి బస్సుచార్జికి దాచుకున్నారో నాకైతే తెలియదు. అయితే, పెదవులు తడారిపోవటం మాత్రం తెలుసు. ఇంత అవస్థకూడా నేనందించే ఈ చిన్న పిప్పరమెంట్ తీసుకోవటానికి సందేహిస్తున్నారు. మంచిదే అనుకోండి. సమాజంలో తోడేళ్ళూ, గుంటనక్కలూ వగైరా వగైరా ఉంటాయనేది నిజమే. అయితే, వాటిల్లోకూడా కొందరైనా...మానవత్వం ఉన్న మనుష్యులు ఉన్నారని నమ్మకంలేకపోతూంది స్త్రీ. ఇంత జాగ్రత్తగా ఉన్నా, ఎక్కడో అక్కడ మోసపోవటం ఖాయం."

"మిస్టర్!" కోపంగా అంటూంటే ... రామకృష్ణ పట్టించుకోకుండా, "చూడండి! మీకో విషయం చెప్పనా రహస్యం కాదు గానీ, ఇందాక మీకు కాస్త ముందు కూర్చున్న ముదురు నీలం జార్జెట్ చీరె అమ్మాయి చాలా ఘోరంగా మోసపోయింది, పాపం. నిన్న రాత్రి యీ ఇంటర్వ్యూ చేసే ఆఫీసర్ గారిని రెండు గంటలు సంతోష సాగరంలో ముంచేసి, ఇంక ఉద్యోగం నాకు రాక ఎక్కడికి పోతుందని ధీవిగా ఎలా వచ్చిందో చూశారుగా! పాపం, రాత్రివరకూ ఈ కంపెనీలో ఓ 'టైపిస్టు' ఉద్యోగం ఆ అమ్మాయికే తప్పక యివ్వాలని ఆయన అనుకున్నారట. కానీ, తెల్లారి ఎనిమిదింటికి ఆయన 'మొగుడి' దగ్గర నుంచి మరో చిలక గోల్డెన్ లెటర్ పట్టుకు చక్కా వచ్చింది. లోపల ఆర్డర్సుమీద సంతకం ఎప్పుడో జరిగిపోయింది. ఇది తెలిసిన నీలం చీరె అమ్మాయి బోరుమంటూ రహస్యం బట్టబయలు చెయ్యబోతే మానేజర్ గారు వెనకదారిన ఎలాగో వదిలించేసుకున్నారట కనక మనం ఇంక ఇక్కడ ఎదురుచూడటం అనవసరం. ఈ లాంటివేవో ఉంటాయనీ, ఈ ఇంటర్వ్యూ 'వేడుక'గా పిలిచిందనీ తెలిసే వస్తూ ఉంటారు."

ప్రభ ఆశలన్నీ కుప్పగా కూలిపోవడానికి సిద్ధంగా ఉన్నాయి, ఒక వైపునించీ కూలిపోతున్నాయికూడా. ముఖంలో కళ తగ్గిపోయింది. 'హుష్' అంటూ నిట్టూర్పు విడిచి లేచి వెళ్ళటానికి ప్రయత్నిస్తూంటే "అయ్యో! అదేమిటలా 'డీలా' పడిపోయారేంటి! సారీ, నిజం నిష్టూరంగా

వున్నా నేను చెప్పింది అక్షరాలా నిజం. అదిగో చూశారా! అటు చూడండి...ఆర్డర్ వచ్చిన అమ్మాయిని అభినందిస్తూ ఏడవలేక నవ్వుతూ మన సోదర సోదరీమణులు మెల్లగా ఇంటిముఖం పట్టేస్తున్నారు. అయ్యో రామ. మీ రింకా నిరాశలోనించి తేరుకోలేదు. కొత్త పూజారిలా వున్నారు. అప్పుడే ఏమైంది? ఈలాంటి ఆశాభంగాలు ఎన్ని కావాలో ఉద్యోగం రావాలంటే!"

"నిజంగా!"

"అక్షరాలా! నాకీ ఇంటర్వ్యూ ఎన్నోదని అడగండి చెపుతాను. ఇది...ఇది ఏభైనాలుగోది."

"బాప్ రే!" గుండె పట్టుకుంది ప్రభ.

"ఆశా, నిరాశా అనే స్పందనని నా మనస్సు మరిచిపోయింది. ఓ రహస్యం చెప్పమంటారా! నాకీ ఉద్యోగం నిజంగా రావాలనే కోరిక లేదు. ఇలా నిరుద్యోగిగా వుంటే హాయిగా ఎన్ని ఇంటర్వ్యూల వేడుకలైనా చూడవచ్చు. పేరంటానికి వచ్చే అమ్మాయిలూ, పెళ్ళిళ్ళకి వచ్చే అబ్బాయిల్లా వచ్చే యువకులనీ కాన్సేపు ఒక చోట సరదాగా చూస్తూ వాళ్ళ ముఖాలని పరీక్షించి, మన స్తత్వాలనీ అర్థం చేసుకోవటానికి ప్రయత్నిస్తూ 'సైకాలజీని' స్టడీచేస్తున్నారు. డబ్బు సంపాదనా, పేకాటా, లాటరీలూ ఎలా వ్యసనమై మనిషిని వశపరచుకుంటాయో, అలాగే ఈ ఇంటర్వ్యూల తతంగం ఓ వ్యసనమై నన్ను మహా పీకిస్తూంది. ఏ చిన్న ఉద్యోగానికైనా సరే, అప్లికేషన్ పెట్టేస్తాను."

చాలా చిత్రంగా అనిపిస్తున్నాయి అతని మాటలు. ప్రభ ఇంటికి వెళ్ళటానికి మెల్లగా లేచి సర్టిఫికెట్ లు జాగ్రత్తగా పట్టుకుని ఊతకర్ర సాయంతో అడుగు ముందుకు వెయ్యబోతూ, "ఇంక సెలవా మరి! పేరు చెప్పకుండా వెళ్ళ బుద్ధికావటంలేదు. నా పేరు "ప్రభ" అంది నమస్కారం చేస్తూ. అతను ప్రతినమస్కారం చెయ్యకుండానే 'ఏం ప్రభ! ఆంధ్రప్రభా, లేక లక్ష్మీప్రభా! ప్రభకి ముందూ వెనకా ఏం లేకుంటే బాగాలేదు" అంటూంటే నవ్వునవస్తున్నా ఆపుకుంటూ "అలాంటివేంలేదు. సింప్లీ ప్రభ, మరి సెలవా, రామకృష్ణగారూ" అంది.

"నాన్సెన్సు, వట్టి ప్రభ ప్రభ అంటే ఏంబాగాలేదు. కోటప్పకొండ తిరణాల్లో ప్రభలా వుంది మీ పేరు. పోనీ, ఆ ప్రభ అన్న పేరుని అందంగా మార్చనా!"

ప్రభ ముఖం దేవురించింది. "మిస్టర్! అధికప్రసంగం" అంటూ మెల్లగా వెళ్ళుతూంటే అక్కడ చేరినవాళ్లూ ఒక్కొక్కరూ వెళ్ళిపోతూ ప్రభని మరోసారి చూసి కళ్లు తిప్పుకుంటున్నారు వాళ్ళ ముఖాల్లో నిరాశ కొట్టవచ్చినట్లు కనిపినూంది. రామకృష్ణ మరేం మాట్లాడకుండా నడుస్తూ మరో పిప్పరమెంటు నోట్లో వేసుకున్నాడు. బస్ స్టాప్ దాటి కొంతదూరం వెళ్ళి, ప్రభకూడా ఆ దారినే నడిచిరావటం గుర్తించి ఆగి దగ్గరికి రాగానే "చూడండీ! మీరూ, నేనూ కావ నుకున్నా, వద్దనుకున్నా కొంతదూరం ఒకే రోడ్డుమీద నడవక తప్పదులావుంది. అంటే, సహ

ప్రయాణికులం అన్నమాట. మీరు బస్సు ఎక్కలేదు. నేను చస్తే ఆర్. టిసి.కి నాలుగణాలు జన్మలో ఇవ్వను. ఎందు కంటే, ఇరవై పైసలు పెట్టి ఈ స్లాయింగ్ పిప్పరమెంటు పాకెట్టు కొని జేబులో వేసుకున్నానంటే అలాగ్గా అయిదారు మైళ్ళు నడిచివెళ్ళి తిరిగి రాగలను. చూడండీ, నా శరీరం అనే ఈ ఇంజన్‌కు ఈ పిప్పరమెంటు పెట్రోలులా పనిచేస్తుంది. నవ్వు వచ్చినా ఆపుకోవటం అంత ఆరోగ్యప్రదం కాదు. ఈ మెయిన్‌రోడ్డుమీద నించి మలుపు తిరగవలసివచ్చేదిముందు మీరో, నేనో ఇంకా నాకు తెలియదు. కనక ఈ కాస్సేపూ హాయిగా కబుర్లు చెప్పుకుంటూ నడిస్తే నష్టం ఏంటం టారూ..."

"నా విషయం వదిలి మీరే ముందు మలుపు తిరగ వలసివస్తే?" ప్రభకి ఇంటర్వ్యూలో సెలక్టు కాలేకపోయా నని బాధ లోలోపల వేధిస్తూన్నా, పైకి సరదాగా మాట్లాడ టానికి ప్రయత్నిస్తూ అంది: "చెప్పమంటారా! మీరు కను మరుగయ్యేవరకూ వెనక్కి తిరిగి చూస్తాను. ఆ తరువాత నే వెళ్ళే ప్రతి ఇంటర్వ్యూకీ మీరు వచ్చారా, లేదా అని చూస్తాను. రాకపోతే 'ఉద్యోగం' దొరికింది కాబోలు. అదృష్టవంతురాలు అనుకుంటాను."

నవ్వేసింది ప్రభ. రామకృష్ణా నవ్వేశాడు.

"మీరు అవునన్నా, కాదన్నా ఈనాటి సమాజంలో స్త్రీ అయి ఉండటమే గొప్ప అదృష్టం. అన్నింటికీ లేడీస్ ఫస్టు అంటూంది నవనాగరిక సమాజం."

"నాలాంటి నిర్భాగ్యురాలికి కూడానా?"

రామకృష్ణ క్షణం ప్రభ చచ్చుపడిపోయిన కాలివైపు దృష్టి నిలిపి వెంటనే మరల్చుకున్నాడు. మాటలకి వెతుక్కోని అతని స్వభావం క్షణంవిరామంకోసం ఆగినట్లయింది. అంతలోనే నవ్వి అన్నాడు: "మిమ్మల్ని చూసి కూడా అదృష్టవంతులని మళ్ళీ అంటున్నాను."

ప్రభ కళ్ళలో నీళ్ళు సుళ్ళు తిరిగాయి. గాద్గదికమైన గొంతు సరిచేసుకుంటూ "రామకృష్ణగారూ! స్త్రీ అందంగా, అపురూపంగా, పువ్వులా ఏ తల్లిదండ్రుల చాటునో, అన్నదమ్ముల ఆప్యాయతలోనో పెరిగితే నిజంగా మీ రన్నట్లు అదృష్టవంతురాలన్నా నే ఒప్పుకుంటాను. కానీ, నాలాంటి అవిటిదాన్ని చూస్తూ, చూస్తూ ఎవరు పెళ్ళాడటానికి ముందు కొస్తారు? ఉద్యోగం ఎవరిస్తారు? అతి సామాన్య స్థితిలో వున్న నాలాంటి ఆడపిల్ల గతి ఏమిటి? ఇప్పుడు చెప్పండి, నే నదృష్టవంతురానినేనా?"

నిలదీసి ప్రశ్నించింది ప్రభ. రామకృష్ణ మౌనంగా ఊరుకోవటంతో మరీ ఆవేశపడిపోతూ "ఇంటర్వ్యూకొచ్చిన వాళ్ళ విషయమే తీసుకుందాం. బి. ఎ. లు, ఎమ్. ఎ. లు ఈ చిన్న ఉద్యోగానికొస్తే ఎలా! అసలు ఈ కంపెనీలో ఉద్యోగం దొరికినా, వారిచ్చే జీతం వీళ్ళు వేసుకున్న ఒక్క బట్టల ఖరీదంత లేదు. అలాంటప్పుడు..."

"ఆగండి, ఆగండి- ఈ వచ్చిన వాళ్ళందరిస్థితి బాగుం

దనా మీ ఉద్దేశం? ఇందులో కొందరికైనా నా లాంటి అద్దెబట్టలే అంటాను. టిప్‌టాప్‌గా డ్రెస్సయితేగానీ, సమాజంలో గౌరవం వుండదనేది యదార్థం కదూ! అందుకే ఈ కాలంలో ఇదివరకెన్నడూ లేనంత వేషాడంబరం ఎక్కువయింది. 'మెరిట్'ని బట్టి ఉద్యోగాలు వచ్చే రోజుల్లో దుస్తుల కింత ప్రాధాన్యం ఉండేది కాదనుకుంటాను. మరి మీా రేమంటారు?"

"నాకు ఈ విషయాలన్నీ ఆలోచించే శక్తిలేదు. మళ్ళీ పేపరూ, అడ్వర్‌టైజ్‌మెంట్లూ, అప్లికేషన్ పెట్టడాలూ, ఇంటర్వ్యూలూ. భగవాన్, జీవితం అంతా ఈలాగే తెల్లారేలావుంది." నిట్టూర్చి ఆగిపోయింది ప్రభ.

"నాలోనూ ఇలాగే ఆవేశం సెగలూ పొగలూ కక్కి పరిస్థితులతో రాజీపడ్డట్లు చప్పగా చల్లారిపోయింది. ఇప్పుడు నాకు సంతోషానికీ దుఃఖానికీ, ఆశకీ నిరాశకీ తేడా తెలియటంలేదు. ఏం నిలిచిపోయారేం? ఓ...మీ మలుపు వచ్చేసింది ముందరే! సరే." అని ప్రభతోబాటు రోడ్డు అవతలివైపుకి వచ్చి "మరింక సెలవు" అంటూ చేతులు జోడించాడు. ప్రభకి మనస్సు అదోలా అయిపోయింది. రామకృష్ణ వెళ్ళిపోతూ ఉంటే బొమ్మలా చూస్తూ నిలిచిపోయి, 'భలేవాడు' అనుకుంటూ ఊతకర్రల సాయంతో నడుస్తోంది.

రామకృష్ణ కొంతదూరం వెళ్ళినవాడు త్వరత్వరగా వెనక్కివచ్చి "చూడండి, మీ పేరు ఎలాగో ప్రభ కదా!

మంచినీళ్లు అందిస్తున్న తల్లిని "అమ్మా, అన్నయ్య వచ్చాడా!" అంది. 'లేదు.' ఈ జవాబులో ఆ మాతృ హృదయం ఎంత తల్లడిల్లిపోతూందో అర్థమవుతూనే ఉంది. విశ్వం ఈ మధ్య ఇంటికి సరిగ్గా రావటంలేదు ఎక్కడ తింటున్నాడో, ఎక్కడ తిరుగుతున్నాడో అడిగినా చెప్పటంలేదు. అతని మౌనం ప్రభని గాభరా పెట్టేస్తూంది. ఉద్యోగప్రయత్నం చెయ్యటం పూర్తిగా మానేశాడు. అప్పుడప్పుడూ వచ్చి ఒకటీ, రెండు రోజులు ఉండి పదీ ఇరవై ఇచ్చి వెళ్ళిపోతూన్నాడు.

"నువ్వెక్కడికీ వెళ్ళవద్దు. నేనేదో ఒక ఉద్యోగం వెతుక్కుంటాను" అంటూన్న చెల్లెలిని దగ్గరికి తీసుకుని ప్రేమగా వీపు నిమురుతూ "ఈ సారి నీ పెళ్ళి చేయగలంత డబ్బు దొరికితేగానీ రాను. ఇదే నా శపథం. నే రావటం ఆలస్యమయినా అధైర్య పడవద్దు. అమ్మకి ధైర్యం చెప్పు. ఇంతకి మించి మరేం చెప్పను" అంటూన్న అన్నగారిని గట్టిగా పట్టుకుని ఏడుస్తూ అంది:

"నాకు పెళ్ళి వద్దు. వద్దూ, వద్దూ! నువ్వు నిప్పుతో చెలగాటమాడుతున్నావు, నాకు తెలుసు. నువ్వలా వెళ్ళద్దు" నెత్తి కొట్టుకుంటూ ఏడ్చింది ప్రభ.

"ఒట్టి పిరికిదానివి. జీవితానికి ఎదురీద గల పరిస్థితులేవస్తే ఏం చేస్తావమ్మా" అని అప్పటికి ప్రయాణం మానేసినట్లు నటించి ఎవరూ చూడకుండా మెల్లగా జారిపోయాడు విశ్వం.

అన్నగారిని ఆపగల శక్తి తనకీ, తల్లికీ లేదని తెలుసుకున్న ప్రభ ఏడ్చి ఏడ్చి తనకి తనే ధైర్యం తెచ్చుకుని, తల్లికి ధైర్యం చెపుతూ నిర్విరామంగా ఉద్యోగ ప్రయత్నం చేస్తూనే ఉంది. కానీ, ఏ ఒక్కటీ కలిసిరావటం లేదు.

• • •

మరో రెండు నెలలు గడిచిపోయాయి. ప్రభ మరో మూడు ఇంటర్వ్యూలకి వచ్చింది. రామకృష్ణ కోసం కళ్ళు వెతికేవి. కానీ, అతడు కనిపించలేదు 'అతడు అడిగినప్పుడు ఇంటి అడ్రెస్ ఇచ్చి ఉంటే బాగుండేది. కానీ, నా వన్నీ వెధవ అనుమానాలే! రాడీవెధవేమో! అనుకున్నాను. పాపం, మంచివాడులా ఉన్నాడు. స్నేహపాత్రుడుకూడా. ఇంటికి తీసుకొచ్చి అమ్మకి పరిచయం చేసివుంటే బాగుండేది' అనుకుంటూ తనని తను తిట్టుకుంది ఎన్నోసార్లు.

నిజంగా రామకృష్ణ వెంటనే కనిపించి వుంటే యీ మంచి అభిప్రాయం ఏర్పడి ఉండేది కాదేమో ప్రభకి. కాలం చాలా నెమ్మదిగా నత్తనడక నడుస్తున్నట్లుంది. ఓ కంపెనీలో 'లీవ్' వేకెన్సీ ఒకటి ఖాళీగా ఉందని తెలిసి అప్లికేషనుపెట్టి మానేజర్‌ని కలుసుకుని తన కష్టసుఖాలు చెప్పుకుంది. అంతా విని 'చూస్తాను' అంటూ అప్లికేషను తీసుకుంటేనే మహాదానంద పడిపోయింది.

ఉద్యోగం వచ్చినట్లు, రోజూ ఆఫీసుకివెళ్ళి వస్తూన్నట్లు, మొదటి నెలజీతం అందుకుని అమ్మకిచ్చి ఆమె కళ్ళలో కనిపించే సంతృప్తిని తనివితీరా చూసి ఉప్పొంగి

పోయేట్లు, ఈ సారి అన్నయ్యవస్తే ఇంక బయటికి వెళ్ళనీయకుండా పట్టి కట్టి ఆ కంపెనీలో ఓ చిన్న ఉద్యోగం వేయిస్తే హాయిగా యిద్దరూ ఆర్థిక యిబ్బందులు లేకుండా, ఆకలి బాధ లేకుండా ఉండచ్చు. అప్పుడు...ఎంత బాగుంటుంది!

అన్నట్లు రామకృష్ణ, ఎక్కడన్నా కనిపిస్తే 'మీకు ఉద్యోగం దొరికిందా?' అని అడిగి 'నాకొచ్చిందండోయ్' అని చెపితే అతనుకూడా బహుశా సంతోషపడతాడు... ఆలోచనల్లో తేలిపోతూ రోడ్డుపక్కగా ఊతకర్రలసాయంతో గాలిమేడలు కడుతూ పరిసరాలను మరిచిపోయింది ప్రభ. ఎదురుగా తలవంచుకుని విసురుగా వస్తూన్న వ్యక్తి దాదాపు ప్రభని డీకొట్టబోయి టక్కున ఆగి క్షణం పరీక్షగా చూశాడు. ప్రభ కోపంతో తల ఎగరేస్తూ "ఏయ్ మిస్టర్! కళ్ళు కనబడటంలా" అంది తీక్షణంగా.

"అరే...స్నేహప్రభగారా! నమస్కారం. ఎంత సుదినం ఈ రోజు! అనుకోకుండా ఎదురైనారు. ఇదిగో నా నమస్కారాలు" సంతోషంగా చేతులు జోడించాడు రామకృష్ణ. ప్రభ ముఖంలో రంగులు గబగబా మారిపోయాయి. సంతోషంతో ఉక్కిరి బిక్కిరవుతూ, "మీరనుకోలేదు. క్షమించాలి. ఊఁ. ఇంతకీ విశేషం ఏమిటి? మనుషుల మీంచి నడిచేస్తూన్నారు. ఉద్యోగం దొరికిందేమిటి."

"ప్చ్. మీకు జోక్ చేయటంకూడా రాదు. ఉద్యోగమేవస్తే ఇలా రోడ్డుమీద నడవటం ఏం ఖర్మ! ముత్యాల

పల్లకీలో ఊరేగుతాను. కాదు కాదు, హెలీకాప్టరులో అలా అలా గిరిగింతాలు తిరిగేస్తాను. అప్పుడే గనక మీరు కని పిస్తే గుర్తుపడతానా! ఒకవేళ గుర్తించినా ఆగి 'హల్లో, ప్రభగారూ'... కాదు కాదు, స్నేహప్రభగారూ అంటూ పలకరిస్తానా! చూడండి... ఇందుకే నాకు ఉద్యోగం రాదు. మీకా భయం అక్కరలేదు. ఏమిటలా పరీక్షిస్తున్నారు.

"ఈ బట్టలాండి...ఇవీ మరీ ఇరుకై నా శరీరాన్ని మహా అవస్థపెడుతూన్నాయి. ఎవరిదో టైట్ పాంటూని పట్టా. చూడండి 'లూజా'. బట్టల పాషన్ ఇప్పటికి బాగా ప్రచారంలో కొచ్చినా మా లాండ్రి వెధవ ఇలాంటి టైట్ పాంటు యిచ్చి నా 'పరువు'ని గుంభనగా ఉంచకుండా బట్ట బయలు చేసేస్తూన్నాడు. ఇంతకీ మీరెక్కడినించి వస్తూ న్నట్లు! ఏ ఇంటర్వ్యూలో నైనా సెలక్ట్ అయినారా? ఉద్యోగం వచ్చిందా! వస్తుందా!"

ప్రభ తను చేసే ప్రయత్నాలు అన్నీ చెప్పి త్వర లోనే 'రావచ్చు' అని ఆశాభావం వెల్లడించింది. రామకృష్ణ ముఖంలో సంతోషం వెల్లివిరియటం గ్రహించింది ప్రభ.

"నే చెపుతున్నానుగా! చూడండి, ఈ ఉద్యోగం మీకు తప్పక వస్తుంది. నిజం చెపుతాను. ఒక్క విష యంలో. ఏమిటంటే, మీరు ఏ అవిటితనానికి అమితమైన బాధపడిపోతూ లోలోపల వ్యధ చెందుతున్నారో, ఆ 'అవిటి తనం' వల్లనే మీకు జీవితంలో కొంత ఊరడింపు - అంటే

ఎదటి వ్యక్తిలో జాలిగామారి ఉద్యోగరూపంలో మీ ఎదుట అదృష్టదేవత ప్రత్యక్షం అవుతుంది. చూడండి, స్నేహప్రభగారూ! అవిటితనమే అయినా, ఆకలితో మాడ నక్కరలేదు. ఇదీ దేవుడిచ్చిన వరం అనుకోండి. మనస్సుని ప్రశాంతంగా ఉంచుకోండి. ఏ పరిస్థితి భగవంతుడు కల్పించినా మన మంచికే అనుకుంటేగానీ, ఈ నిష్ఠుర ప్రపంచంలో మనలాంటి అతి సామాన్యులు బ్రతకలేరు. సారీ, మరోలా అనుకోరుగా."

ప్రభ ఉబికి వచ్చే కన్నీళ్ళని తుడుచుకుంటూ అతను వివరాలు అడిగినప్పుడు చెప్పటానికి సందేహించినా, ఇప్పుడు తనూ, తల్లీ, అన్నగారూ, ఇంటి పరిస్థితీ, అన్నగారి నిరుద్యోగం - ఇలా అన్నీ చెప్పేసింది. రామకృష్ణ, నిశ్శబ్దంగా అంతా విన్నాడు.

"ఈనాడు ఇలాంటి కుటుంబాలు ఎన్నో...సమాజంలో...సరే...ఇక ఆ విషయాలు వదిలేద్దాం.మరి మీకు ఉద్యోగం వస్తుందని ఇంత గట్టిగా చెపుతూన్న నాకు ఇది వస్తే ఏమిస్తారు?"

"మీ కేం కావాలి? ఏం కావాలన్నా ఇస్తాను."

"ప్రామిస్?"

"ఎస్!"

"అయితే స్నేహప్రభగారూ! మాట తప్పకూడదు, జాగ్రత్తగా వినాలి సుమా...ఆ తరవాత .."

ప్రభ మనస్సులో ఎన్నో ప్రశ్నలూ, జవాబులూ గిరగిరా అతి వేగంగా తిరిగేస్తున్నాయి. ఒక వైపు సంతోషం; మరో వైపు సంకోచం...ఎన్నెన్నో భావాలతో ఉక్కిరి బిక్కిరై పోతూంది.

"అబ్బబ్బ! సస్పెన్స భరించలేకుండా ఉన్నాను, చెప్పండి త్వరగా."

"నాకు...నాకు...నాకో రివాల్వర్ కొని ఇవ్వండి."

పక్కన బాంబు పడ్డంత గాభరా పడిపోయింది ప్రభ.

"రివాల్వరా! ... ఇదేం కోరిక ... రివాల్వర్! ఎందుకూ?"

"ఎందుకేమిటి నా ముఖం! ఈ సమాజానికి పట్టిన బూజు దులపటానికి ..మీ లాంటి, నా లాంటి, మీ అన్నయ్యలాంటి వాళ్ళకి కొందరికైనా ఉద్యోగాలు రావాలంటే.. అలాంటి అవకాశం కల్పించాలంటే ఆఫీసర్లకీ, కంపెనీల అధికార్లకీ, మానేజర్లకీ, ఏజంట్లకీ కాస్త అంతరాత్మని మేలుకొలపాలి. ఇలా మేలుకొలుపు పాడాలంటే రివాల్వర్ అవసరం లేదంటారా?"

"రామకృ...ష్ణ...గారూ" అంది గాభరాగా.

"అయ్యో! అంతలా కంగారుపడి పోతున్నారెందుకు?"

"కంగారేం లేదు కానీ...మీ లాంటి...మంచివాళ్లు అలాంటి ఆలోచనలని మనస్సులోకి రానీయకూడదు... ఇలాంటి మాటలు ఎప్పుడూ చెప్పకండి...ప్లీజ్."

"స్నేహప్రభగారూ! మీ చుట్టూ వున్న సమాజాన్ని చూస్తూన్నారుగా!! మంచికి చోటుందా! ఎంత దగా? ఎంత మోసం? ఎన్నో ఎందుకూ; ఈ ఇంటర్వ్యూలు విషయమే తీసుకుందాం. ఉండేవి ఒకటో రెండో ఖాళీలు. అవి ఏ మినిష్టర్ బావమరిదికో, ఆఫీసర్ చెల్లెలికో, లేక ప్రియురాలికో, లేక శీలాన్ని అమ్ముకున్న కన్నెపిల్లకో నిర్ణయం అయిపోయి ఉంటాయి. పోనీ, ఆ ఉద్యోగాలు అలాంటి వాళ్ళకే యిచ్చుకుంటే పోలా! ఇలా ఇంటర్వ్యూలంటూ పెట్టి నిరుద్యోగుల ఆశలతో చెలగాటం ఎందుకూ అంటున్నాను. నిరాశని తట్టుకోవటానికి ఎంత శక్తికావాలి? ఎందుకీ దగా! ఎందుకింత మోసం? ఎందుకీ రాక్షసత్వం?"

రామకృష్ణ ముఖం ఎర్రబడి కళ్ళు అగ్నిగోళాల్లా అవటం చూసిన ప్రభలో వణుకు ప్రారంభమయింది. కంపిస్తూనే రెండు చేతులతోనూ ముఖం కప్పుకుని భయంగా "రామకృష్ణగారూ!" అంది.

"నా కడుపు మండిపోతూందండీ...నా స్నేహితుడు బి. ఏ. పాసై ఇలాగే ఇంటర్వ్యూలకి వెళ్ళి వెళ్ళి తన చదువుమీదా, తెలివితేటలమీదా నమ్మకం పోగొట్టుకొని కేవలం తన అశక్తతవల్లనే ఉద్యోగం రావటంలేదని నిరాశపడి రెండు రోజులక్రితం ఆత్మహత్య చేసుకున్నాడు. ఇప్పుడు చెప్పండి...ఇలా ఎందరి మరణానికో కారణమవుతూన్న వాళ్ళని, లంచాలకి ఉద్యోగాలు అమ్మేవాళ్ళని ఏంచెయ్యాలి? మీరు చెప్పండి."

5222
శ్రీకాకుళం

"రామకృష్ణగారూ! సమాజంలో పరిస్థితులు ఆశాజనకంగా లేవు. నిజమే! కానీ, అందుకని మీ లాంటి చదువుకున్న వాళ్ళు హంతకుల్లా మారితే...మారితే... ఎలా...ఎలా వద్దు...అలాంటి ఆలోచనలు మానేయండి. మీకు దణ్ణం పెడతాను" ప్రభలో కనిపిస్తూన్న వేదనని, వణుకునీ గుర్తించిన రామకృష్ణలోని ఆవేశం మెలమెల్లగా జారిపోయింది. ప్రశాంతపడి ఎప్పటిలా నవ్వేస్తూ అంత గాభరా పడిపోయారేంటీ! సరే, ఆ విషయం వదిలేద్దాం... మరేదైనా చెప్పండి."

ప్రభ రెండు నిమిషాలు మరేం మాట్లాడలేక మెల్లగా అంది:

"మీకు ఉద్యోగం లేదుకదా - ఇల్లు ఎలా గడుస్తూంది?"

"మా అమ్మ ఏనాడో నేర్చుకున్న చేతి 'కుట్టు' ఇప్పుడు మాకు జీవనాధారం అవుతూంది. ఆవిడ జాకెట్లూ, లంగాలూ 'అందాజ్'గా కత్తిరించి చత్వారంజోడు పెట్టుకుని గుడ్డిదీపం దగ్గర కుడుతూ ఉంటుంది. సూదిలో దారం ఎక్కించి ఇచ్చేవరకే నా సహాయం ఆవిడకి.

'కటింగ్ అయినా నేర్చుకోరా! ఇంత అన్నం అయినా తినవచ్చు. ఇల్లూ, వాకిలీ తుడిచిపెట్టి నీకు చదివించినా దమ్మిడీ సంపాదించే తెలివిలేదు' అంటూ చీవాట్లు వేస్తూంది. అయినా, నేను నేర్చుకోలేకపోయాను.

స్నేహప్రభగారూ, బి ఏ. పాసైనందుకు ఏదో రకంగా ఒక ఉద్యోగం ఎతుక్కోవాలి గాని, ఈ కుట్టూ, గిట్టూ అంటే జీవితంలో ఎప్పటికి పైకి పోగలం చెప్పండి."

"ఉద్యోగం లేకున్నా పోనీ, నాలుగు ట్యూషన్లన్నా దొరకలేదూ!"

"అదీ వెలగబెట్టాను. ఓ శ్రీమంతురాలు నెలకి ఇరవై యిస్తాను, నలుగురు పిల్లలకి చదువు చెప్పమంది. ఎగిరి గంతేసి ప్రారంభించాను. కానీ వారంరోజులు కూడా తిరగలేదు. ఆ పిల్లలు బ్రహ్మరాక్షసులు. చస్తే చదవరు. నెమ్మదిగా చెపితే వినరు. కోపంచేస్తే ఉద్యోగానికే ఎసరు పెట్టేశారు. ప్రయివేట్లు చెప్పటం అంత దరిద్రపు ఉద్యోగం మరి లేదు-అందులో చదువు అక్కర్లేని పిల్లలకి. అలాగే ఓ షావుకారు దగ్గిర లెక్కలు రాయటం. అన్నీ దొంగలెక్కలే రాయాలట. పదిహేను రోజులకే 'గుడ్‌బై' చెప్పి వచ్చేశాను. ఇలా ఎన్నో అనుభవాలు. అన్నీ కలిపితే ఓ గ్రంథం రాయవచ్చు" నవ్వేశాడు రామకృష్ణ.

ప్రభ నవ్వి, "మరింక సెలవిస్తారా" అంది.

"సారీ! చాలాసేపునిలబెట్టేశాను. సరే, ఇంక వెళ్లండి. కానీ, ఉద్యోగంవస్తే మాత్రం నా కోరికని మరిచిపోకండి."

"అదిగో మళ్ళీ అదేఅడుగుతున్నారు. అదేం ఇవ్వను కానీ, ఓ స్ట్రాంగ్ పిప్పరమెంటు పాకెట్ కొని ఇస్తాను. కావాలంటే డబ్బు సాయంచేస్తాను. నే చేయబోయే కంపెనీ

మానేజర్‌కి మీకూ ఓ చిన్న ఉద్యోగం ఇమ్మని ప్రాధేయ పడతాను

"స్నేహప్రభగారూ! రివాల్వర్ కావాలంటే మీ రంత భయపడటం దేనికి ఆయుధం ఏదైనాసరే. ఒకరిని శిక్షించేందుకు కాదు, ఆత్మరక్షణకికూడా పనికి వస్తుందిగా!

"మీ లాంటి వారికి వాటి అవసరం రాదనీ, రాకూడదనీ నా నమ్మకం."

"మీ నమ్మకానికి థాంక్స్ సరే, మీకు ఉద్యోగం వచ్చిన తరువాత కలుసుకుందాం ఇలాగే."

"ఎక్కడ?" ప్రభ ఆత్రంగా అడిగింది, అతని ముఖంలో ఏదో మార్పుని గుర్తించటానికి ప్రయత్నిస్తూ.

"ఎప్పుడో ఎక్కడో ఇలాగే? మరి సెలవా!"

ఇదివరకు ప్రభని రోడ్డు దాటించి, 'జాగ్రత్తగా వెళ్ళండి' అని చెప్పిన రామకృష్ణ ఇప్పుడదేదీ పట్టించుకున్నట్లులేదు. అది బాధ కలిగిస్తున్నాసరే - అంటూ ప్రభ రోడ్డుకి అటూ యిటూ చూస్తూ, "నమస్కారం" అంటూ రెండడుగులుకూడా వెయ్యకుండానే ఓ పదిహేనేళ్ళ కుర్రాడు రోడ్డున వెడుతూ వెడుతూ ప్రభ ఊతకర్ర లాగి దూరంగా పారేసి ఇహిహీ అంటూన్నాడు.

ప్రభ నిలవలేక కుప్పలా కూలిపోయింది. అవమానం, దుఃఖం ఒక్కుమ్మడిగా చుట్టుముట్టాయి. రామకృష్ణ వెళ్ళబోతూ, ఇది చూసి ఉగ్రుడై పరుగున వెళ్ళి ఆ కుర్రాడిని

పట్టుకుని చావబాదేశాడు. క్షణంలో గుంపు పోగయింది. ఆ కుర్రాడూ రామకృష్ణ మీద కలియబడ్డాడు. ఇద్దరి దవడలూ పగిలిపోయాయి. షర్టులు చిరిగి పీలికలైన తరవాత మధ్యవర్తులు జోక్యం చేసుకొని సర్దేసి ఆ కుర్రాడిని దూరంగా తోసేశారు.

"అయ్యో, పాపం! అవిటిపిల్ల. అందులో ఆడపిల్ల. ముక్కూ మొహం ఎరక్కున్నా ఊతకర్రలు లాగి ఆ పిల్ల నిలవలేక విలవిల్లాడిపోతూంటే చూసి ఆనందించటం రాక్షసత్వం కదూ" అంటూన్నాడో ముసలాయన, బరువుగా ఉన్న కూరల సంచీని గట్టిగా పట్టుకుని.

"వేలెడు లేడు వెధవ, పోకిరీబుద్ధులు కాకుంటే ఏమిటిది! అయినా, రోడ్డునపోయే వాళ్ళని ఏదో ఒకటిచేసి బాధపెట్టి రాక్షసానందం పొందటం ఫాషనైపోయింది." ఓ వయస్సుమళ్ళినావిడ ప్రభవైపు జాలిగా చూసి వెళ్ళిపోయింది.

రామకృష్ణ ఊతకర్ర తెచ్చి చెయ్యి ఆసరా యిచ్చి లేవనెత్తాడు.

"మీకు ఎలా కృతజ్ఞత చెప్పాలో తెలియటంలేదు. నా వల్ల మీ షర్టుకూడా చిరిగి పీలికలైపోయింది" అంది కన్నీళ్లు తుడుచుకుంటూ.

"మీరు భలేవారు. షర్టు చిరిగినందుకు కాదు, నా ఎదురుగానే మీ కిలా జరిగిపోయిందే అని నా బాధ. ఫర్లేదు

పదండి" అంటూ రోడ్డు దాటించి చిరిగిన పర్సు పీలికలు గుప్పిట్లో ముద్దగా పట్టుకుని "నమస్కారం, స్నేహప్రభ గారూ!" అంటూ వెళ్ళిపోయాడు.

స్నేహప్రభ సిగ్గుతో కుంచించుకుపోతూ ఇల్లు చేరి మంచంమీద పడుకుని భోరుమంది.

"ఎందుకమ్మా! ఏమైంది. ఇదిగో చూడు, అన్నయ్య ఉత్తరం రాశాడు. చదువు" అనటంతో గబాలున లేచి కన్నీళ్లు తుడుచుకుంటూ ఉత్తరం గబగబా చదివేసింది. మళ్ళీ మళ్ళీ నాలుగుసార్లు చదివింది. "ఏం రాశాడమ్మా! ఎక్కడున్నాడూ! ఎప్పుడొస్తాడూ?" తల్లి ప్రశ్నలతో ఉక్కిరి బిక్కిరి చేసేస్తూంది.

"ప్రభా!

నే నిప్పట్లో మీ దగ్గరికి రాలేను. అయితే, నీ పెళ్ళికి గాను కొంత డబ్బు త్వరలో పంపిస్తూన్నాను. అమ్మకి నమస్కారాలు అందివ్వు. సమాజంలో ఈ నాడు డబ్బుకున్న విలువ మరి దేనికీ లేదు. అది వుంటే అన్ని అవకతవకలనీ కప్పేస్తుంది. ఆత్మీయులను చుట్టూ చేరుస్తుంది. అది సంపాదించే విధానం ఏదైనా కావచ్చు. కనకనే ఆ డబ్బు సంపాదించి మనుషులని కొనేస్తాను. ఈ డబ్బు ఉంటే నీ పెళ్ళి దానంతట అదే అవుతుంది. నా అవసరం ఉండదు. నువ్వు బాధ పడవద్దు అమ్మకి ధైర్యం చెప్పు. వీలుంటే మళ్ళీ

ఉత్తరం రాయటానికి ప్రయత్నిస్తాను. నా వివరాలకోసం ప్రయత్నించవద్దు. మరి ఉంటాను, చెల్లీ.

ఇట్లు,
—విశ్వం."

ప్రభ చదవటం పూర్తి చేసింది. తల్లి నోట్లో పమిట కొంగు కుక్కుని లోలోల కుమిలిపోతూంటే చూడలేక, తన బాధని మింగలేక శిలావిగ్రహంలా కూర్చుండిపోయింది. కానీ, లోలోన "నాకు పెళ్ళివద్దు అన్నయ్యా, పెళ్ళివద్దు" అని ఎంత ఆక్రోశించినా విశ్వానికి వినిపించనంత దూరంలో ఉన్నాడు.

* * *

ప్రభకి ఉద్యోగం వచ్చింది. అఫీసులో జాయినై ఇంటికి వస్తూ, ఆఫీసుకు వెడుతూ రామకృష్ణ కనిపిస్తే బాగుండునని వెయ్యి కళ్ళతో చూస్తూంది. వారంరోజు లైనా కనిపించలేదు. అతను కనిపిస్తే ఇవ్వాలని స్ట్రాంగ్ పిప్పరమెంటు పాకెట్టు కొని ప్రతిరోజూ వెంట తీసుకువెడుతూంది.

అన్న ప్రకారం విశ్వం దగ్గరనుంచి మూడువేల రూపాయలు వచ్చాయి. ఈ డబ్బు ఎలా సంపాదిస్తున్నాడో ఏం కానిపని చేస్తూన్నాడో అని సుశీలమ్మకి ఎన్నో అనుమానాలు, కొడుకు మరీ మరీ దూరమైపోతూన్నందుకు లోలోపల దుఃఖపడిపోతూ పైకి మనిషిలా తిరుగుతూన్నా,

ఒక్కసారి వాడుగనక కనిపిస్తే, మళ్ళీ యింటినించి వెళ్ళ నీయకూడదు. ఏమైనాసరే, వెళ్ళనీయకూడదు. ప్రభకి పెళ్ళి లేకున్నా ఫరవాలేదు. ఆకలితో చచ్చినా ఫరవాలేదు. కానీ, కొడుకుని కానివని యేదీ చెయ్యనియ్యను. భగవంతుడా—అని ఎందరో దేవుళ్ళకి మొక్కుకుంది సుశీలమ్మ.

ఉద్యోగం లేదనే దిగులుతో ఎటూపోక ఇంటిపట్టున ఉంటే నేనే నలుగురిళ్ళలో పాచిపని చేసైనా ఇంత అన్నం పెట్టగలనే అనుకునేది, ఇంక ప్రభ మనస్సులో ఎన్నో ఆలోచనలు.

రామకృష్ణ ఒక్కసారి కనిపిస్తే ఎంత బాగుండును! అన్నయ్య పంపిన మూడువేల రూపాయలూ ఇచ్చి ఏదైనా చిన్న 'బిజినెస్' పెట్టుకోమని చెప్పి అతను తన కాళ్ళమీద నిలబడేలా అవకాశం ఇస్తే యెంత సంతోషిస్తాడు! అవును, మాటల్లో ఒకసారి అన్నాడు కూడా-ఒక్క రెండు, మూడు వేలు చేతిలో వున్నా 'అసలు'కి నష్టం రాకుండా ఏదో ఒక చిన్న 'బిజినెస్' పెట్టుకోవచ్చు అని. మంచివాడే కాదు, మంచి మనస్సున్న వాడు. కనిపిస్తే ఇస్తానని చెపుతాను. చెబితే ఎంత సంతోషిస్తాడో!

'అన్నయ్య ఒక్కసారి ఇంటికి వచ్చేలా చెయ్యి భగవంతుడా! అలా వచ్చిన అన్నయ్యని మళ్ళీ గడప కదల నీయను. తాడు పెట్టి కట్టి పడేస్తాను, లేకుంటే ఉరి పెట్టుకు చస్తానంటాను. నే నింతమాట అంటే అన్నయ్య ఒక్క

అంగుళం కూడా కదిలి ముందుకు వెళ్ళడు. అవును, ఆ విశ్వాసం నా కుంది.

ఇలా ఎన్నెన్నో ఆలోచిస్తూ ప్రభ ఆఫీసులో అడుగు పెట్టింది. మానేజ రింకా రాలేదు. తోటి ఉద్యోగులందరూ ఆ రోజు దినపత్రిక పట్టుకుని గోలగా మాట్లాడుకొంటూన్నారు. అందులో వార్త అంతలా అందరినీ యెందుకు ఆకర్షించిందో అర్థం కాకున్నా, తన సీటులోకి వెళ్ళి కూర్చోబోతూంటే సహ ఉద్యోగిని మేరీ గబగబా వస్తూ, "ఏమండోయ్ ప్రభగారూ! ఇది విన్నారా! నిన్నటిరోజు 'ఫారెస్టు' డిపార్టుమెంటు ఇంటర్వ్యూ జరుగుతూండగా ఒకతను చాలా దురుసుగా వ్యవహరించటమేగాక, ఆఫీసర్ని రివాల్వర్‌తో కాల్చగా, అది గురితప్పి కుడిభుజంలోనించి దూసుకుపోయిందట. ఆయన్ని హాస్పిటల్‌లో చేర్చటం సరే, కాల్చిన నిరుద్యోగిని పట్టేసుకున్నారట" అంటూ తలయెత్తి చూసి, "అదేమిటీ అలా అయిపోతున్నారూ? మిగతాది చదవను తెండి కానీ, గుడ్! బాగా చేశాడు. అతను అచ్చంగా సినిమాహీరోలా" మేరీ గడగడా ఏదో చెబుతూన్నా ఆఫీసులో పనిచేసే యు. డి. పి. సుబ్బారావు నెత్తిన చేతులు పెట్టుకుని ఏడుస్తూండడం అప్పటికిగమనించి మేరీ "ఏమైందీ, ఏమైందీ" అంటూంది, మిగతా అందరూ గుమిగూడారు.

"ఏమవటం ఏమిటి, నా కొంప మునిగిపోయింది. ఫారెస్టు డిపార్టుమెంటులో ఉద్యోగం ఇప్పిస్తాననీ, కూడు వందలు లంచం ఇస్తే ఆర్డర్సు అందుకాయనీ నమ్మించి ఓ

వెధవ నా ఫ్రెండ్ రామకృష్ణకి ఆశ పెడితే ఎన్నాళ్ళుగానో నిరుద్యోగిగా విసిగి వేసారిన రామకృష్ణ నన్ను డబ్బడిగాడు నా దగ్గరెక్కడుంది, కాబూలీవాలా దగ్గర నూటికి పది చొప్పున వడ్డీకి అప్పు ఇప్పించాను నేను మధ్యవ హామీగా ఉన్నాను రామకృష్ణ ఎంత పేదవాడైనా మంచివాడు. పోనీ, నెలనెలా జీతంలో అప్పు తీర్చేస్తాడులే అని ఇప్పించాను. కానీ...ఆ ఆఫీసర్ వెధవ మరొకడి దగ్గర అయిదు వందలు తీసుకుని వాడికి ఆర్డర్ వేయించేశాడని తెలుసుకున్న రామకృష్ణ కడుపుమండి...ఇంత పని చేసి జైలు కెళ్ళాడు. వాడి విషయం అలా వదిలి ఈ కాబూలీవాలా అప్పు నే నెలా తీర్చను."

భోరుమంటున్నాడు సుబ్బారావు.

'ఎంత మోసం! ఎంత మోసం!' అంటూ సానుభూతి చూపిస్తూన్నారు అందరూ. కానీ, ప్రభకి భూమి గిరగిరా తిరిగి పోతూన్నట్లుంది. ఇంక వాళ్ళ మాటలు వినిపించటం లేదు. రామకృష్ణలోని మంచితనం పూర్తిగా చచ్చిపోయే పరిస్థితులు కల్పించింది సమాజం. ఇలాంటప్పుడు రామకృష్ణే కాదు, మరెవ్వరైనా అగ్నిపర్వతంలా మారి తను మండటం కాదు, అందినంతవరకూ భస్మం చేసేస్తాడు. అందుకే ఇలా జరగకూడదు, జరగకూడదు. అయ్యో, రామకృష్ణగారూ! మీరూ అన్నయ్యలా ఆవేశపడి వివేకజ్ఞానాన్ని వదలకండి వదలకండి.'

ప్రభలో ఆవేశం కొంతసేపటికి కానీ తగ్గలేదు. వెంటనే లేచి "లీవు" పెట్టి ఆఫీసు బయటికి వచ్చేసింది. 'రామకృష్ణని తప్పుదారిన పడకుండా ఆపాలి. అతని ఆసరాతో సమాజం మీద 'కసి'తో దోపిడీదారుల్లో కలిసిన అన్నయ్యని సరైన దారికి తీసుకురావాలి. అవును రామకృష్ణ అన్నట్లు నేను స్నేహప్రభనే. స్నేహ హస్తం అందించి రామకృష్ణని రక్షించుకుంటాను. శక్తి ఉన్నంత వరకూ ప్రయత్నిస్తాను. భగవాన్, నాకు శక్తిని ప్రసాదించు. భవిష్యత్తు మీద అచంచలమైన విశ్వాసం ఉంచి ఒంటికాలితో ఒక్కొ అడుగూ ముందు కేస్తూంది ప్రభ స్నేహప్రభ.